క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి భూమిపూజ



కలిగిరి: కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ తోకలవారి పాళెంలో కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

నాడు-నేడు పనుల పరిశీలన

జలదంకి: జలదంకి ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం కింద చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ఎస్ఎస్ఏ ఏఈ రాఘవేంద్ర గురువారం పరిశీలించారు. పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేష్ పాల్గొన్నారు.

సీతారామపురం: అయ్యవారిపల్లి, బసినేనిపల్లి పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ గురువారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని హెచ్ఎం అంజయ్యకు సూచించారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రవీణ్‌కుమార్, చిన్నయ్య, సీఆర్పీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆశీర్వచనం



జలదంకి: కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి సోదరుడు గోవర్ధన్‌రెడ్డి కుమార్తె హిమబిందురెడ్డి, సుష్మంత్‌రెడ్డి వివాహం జమ్మలపాళెంలోని కేవీఆర్ కన్వెన్షన్‌లో గురువారం జరిగింది. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, తదితరులు హాజరయ్యారు.

అన్నదానం



చేజర్ల(సోమశిల): పెంచలకోన బ్రహ్మోత్సవాలకు వెళ్లే భక్తులకు శ్రీమహాలక్ష్మి గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. అనంతసాగరం మండలం ఉప్పలపాడు వద్ద జాతీయరహదారిపై సుమారు 800 మందికి అన్నదానం చేశారు. నిర్వాహకులు చల్లా రాజేష్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు

చేజర్ల, మడపల్లిలో మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు 300 మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

ఆలయ భూముల కౌలు వేలం

కలిగిరి: వెలగపాడులోని పార్వతి సమేత నాగమల్లేశ్వరస్వామి ఆలయ భూముల కౌలు వేలాన్ని గురువారం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన బహిరంగ వేలంలో 107.71 ఎకరాలను ఏడాది కాలానికి గానూ రూ.4,77,500 కౌలుకు రైతులు దక్కించుకున్నారు. ఆలయ ధర్మకర్త రామకృష్ణ, దేవాదాయశాఖ అధికారి సుధీర్, రైతులు పాల్గొన్నారు.

రికార్డులను పక్కాగా ఉంచుకోవాలి

అల్లూరు: పాఠశాలల రికార్డులను పక్కాగా ఉంచుకోవాలని హెచ్ఎంలకు ఎంఈఓ నాగేశ్వరరావు సూచించారు. మండల విద్యావనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ జిల్లా పర్యటనకు రానున్నారని తెలిపారు. అల్లూరు మండంలోని పాఠశాలలను తనిఖీ చేసే అవకాశం ఉన్నందున రికార్డులను పక్కాగా ఉంచుకోవాలని సూచించారు.

ఆత్మకూరు కమిషనర్‌గా నాగేశ్వరరావు



నెల్లూరు(బారకాసు): ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా నాగేశ్వరరావును నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ఉత్తర్వులను గురువారం జారీ చేసింది. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఎన్నికల సెల్ విభాగంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రమేష్‌బాబు 40 రోజుల పాటు సెలవుపై వెళ్తున్న నేపథ్యంలో నాగేశ్వరరావును నియమించారు.

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోకు విశ్వసనీయత

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



పల్లవోలులో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): గత ఎన్నికలకు ముందు ప్రకటించిన మేనిఫెస్టోను చిత్తశుద్ధితో అమలు చేయడం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల్లో విశ్వసనీయత ఏర్పడిందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మర్రిపాడు మండలం పల్లవోలులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. దేశచరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. అవి సక్రమంగా ప్రజలకు అందుతున్నాయో..లేదో తెలుసుకునేందుకు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులను లబ్ధిదారుల వద్దకే పంపించడం చారిత్రాత్మక విషయమన్నారు. సంక్షేమంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టితో పనిచేస్తున్నామన్నారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే లక్ష్యంగా రీసర్వే చేపడుతున్నామని తెలిపారు. చుక్కల భూముల సమస్యలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యేకంగా జీఓ జారీ చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో 17వేల ఎకరాల చుక్కల భూముల సమస్యల పరిష్కారం కానుండడంతో బాధిత రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. పల్లవోలులో నాలుగేళ్ల వ్యవధిలో రూ.13.50 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీ బత్తల గీత, సొసైటీ అధ్యక్షుడు సోమల మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు, స్థానిక నాయకులు గంగినేని రవీంద్రబాబు, పొంగూరు సుధాకర్, చంద్రా నారాయణ స్వామి, రాటకొండ హజరత్ నాయుడు, విల్లుపాటి వెంకటేశ్వర్లు, చెవుల శ్రీనివాసులు, కొమ్మూరు ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నృసింహ జయంతి



ఆత్మకూరు: సంప్రదాయబద్ధంగా పూజా ద్రవ్యాలను ఎడ్ల బండిపై తీసుకెళ్తున్న భక్తులు



ఆత్మకూరు: విశేషాలంకరణలో నరసింహస్వామి

ఆత్మకూరు: పట్టణంలోని బొగ్గేరు వద్ద ఉన్న పెంచల నరసింహస్వామి ఆలయంలో నృసింహ జయంతిని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్త సింహాద్రి దంపతులు సంప్రదాయబద్ధంగా మేళతాళాల నడుమ ఎడ్ల బండిలో పూజాద్రవ్యాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం పెంచల నరసింహస్వామి మూలవిరాట్టుకు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో బస్సు సౌకర్యం లేని రోజుల్లో ఆత్మకూరు నుంచి పెంచలకోన క్షేత్రానికి ఎడ్లబండ్లపై వెళ్లే క్రమంలో బొగ్గేరు వద్ద ఉన్న నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తరలివెళ్లడం ఆనవాయితీ. దాన్ని కొనసాగిస్తూ ఆలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు పానకం, వడపప్పు, తదితర ప్రసాదాలను అందజేశారు.

నేడు కళ్యాణం

నృసింహ జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉదయగిరి: గండిపాళెం జలాశయం ఆవరణలోని సిద్దేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన నరసింహస్వామి ఆలయంలో నృసింహ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ఎల్‌వీ ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.

రామావతారంలో నృసింహుడు



రామావతారంలో నృసింహుడు

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్లలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు రామావతారంలో హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ఆవరణలోని యాగశాలలో వేదపండితులు హనుమగాయత్రి, రామగాయత్రి హోమాలు నిర్వహించారు. అనంతరం లక్ష కుంకుమార్చన చేశారు. రాత్రికి శ్రీవారిని శ్రీరామచంద్రుడిగా అలంకరించి హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా నల్లగొండ్ల పడమర వీధివీరు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి



గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

సీతారామపురం: జగనన్న గృహ లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, హౌసింగ్ ఏఈ రామకృష్ణ కోరారు. పోలంగారిపల్లిలో గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు గురువారం వారు అవగాహన కల్పించారు. పంచాయతీలో 68 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందజేస్తుందన్నారు. డీఆర్డీఏ నుంచి మరో రూ.35 వేలు రుణం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు. ఆయన వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ చెన్నారాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చిన్నయ్య, తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి లబ్ధిదారులతో మాజీ ఎంపీ మేకపాటి, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం అందజేశారు. అనుమసముద్రంపేట మండలం గుడిపాడు సచివాలయం పరిధిలో వలంటీర్లుగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన హైమావతి, వెంగళరావు కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున సీఎం సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయి. అలాగే చేజర్ల మండలం యనమదలకు చెందిన అక్కెం తిరుపతిరెడ్డి అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.10 లక్షల చెక్కు మంజూరైంది. వీరికి మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని నివాసంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పులిమి రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమీకృత దాణాతో అధిక పాల దిగుబడి



కలిగిరి: పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు

కలిగిరి: పాడి పశువులకు సమీకృత దాణా ఇవ్వడం ద్వారా అధిక పాల దిగుబడులు పొందవచ్చని పెద్ద కొండూరు పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు తెలిపారు. కృష్ణారెడ్డిపాళెం గ్రామసచివాలయంలో పశువిజ్ఞాన బడిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. పశువులకు అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నంబర్ 1962కు సమాచారం అందజేస్తే పశుఅంబులెన్స్ వచ్చి వైద్యసేవలు అందిస్తుందన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా పాడిరైతులకు రాయితీపై దాణా, పశుగ్రాసం, తదితరాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పాదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి పెరటికోళ్లు, గొర్రెపిల్లలు అందజేస్తుందని వివరించారు. వీఏఏ రవి, రైతులు పాల్గొన్నారు.

ఆపదమిత్రలకు రక్షణ కిట్ల పంపిణీ




ఆత్మకూరురూరల్: ఇటీవల ఆపద మిత్ర శిక్షణ పూర్తి చేసుకున్న పెన్నానది పరీవాహక ప్రాంత గ్రామాల వలంటీర్లకు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం రక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్నా పరీవాహక గ్రామాలైన అప్పారావుపాళెం, బండారుపల్లిలోని 8 మంది వలంటీర్లు, ఆశావర్కర్లకు ఇటీవల ప్రభుత్వం విపత్తులను ఎదుర్కోవడంపై శిక్షణ ఇచ్చిందని తెలిపారు. వారికి ప్రభుత్వం రక్షణ కిట్లను పంపిణీ చేసిందని చెప్పారు. రక్షణ కిట్ల సాయంతో ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు పల్లవోలు నరసింహులు, ఆనంద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

97.66 శాతం పింఛన్ల పంపిణీ

ఆత్మకూరురూరల్: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ 97.66 శాతం పూర్తయిందని ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం తెలిపారు. 4910 మందికి పింఛన్లు అందజేయాల్సి ఉండగా, 4795 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు వివరించారు.

ఇంటర్ విద్యార్థులకు రెమిడీయల్ తరగతులు



ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ కళాశాలలో రెమిడీయల్ తరగతులను గురువారం నుంచి ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ ఎం వాసుబాబు తెలిపారు. ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు 20 రోజుల పాటు రెమిడియల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దూరప్రాంత విద్యార్థులకు ఎస్సీ వసతి గృహంలో వసతి కల్పించినట్లు తెలిపారు. సప్లిమెంటరీ ఫీజులు చెల్లించిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొగాకు రైతులకు ఎరువులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): 2023-24 పంట కాలానికి సంబంధించి పొగాకు రైతులకు అవసరమైన ఎరువులను సరఫరా చేయనున్నట్లు డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ గురువారం తెలిపారు. ఎరువులు అవసరమైన రైతులు సూపర్‌వైజర్‌ను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

934 పొగాకు బేళ్ల కొనుగోళ్లు

డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో 934 పొగాకు బేళ్లను గురువారం కొనుగోలు చేశారు. మర్రిపాడు క్లస్టర్‌కు చెందిన రైతులు 982 బేళ్లను వేలానికి తీసుకురాగా, 934 బేళ్లను కొనుగోలు చేశారు. 48 పొగాకు బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.180 ధర పలికింది.

నేడు మాజీ మంత్రి కలికి వర్ధంతి

కావలి: మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి 17వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన అభిమానుల ప్రతినిధి కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లోని యానాదిరెడ్డి విగ్రహం వద్ద నిర్వహించే వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ఎండీఓ కార్యాలయ ప్రాంగణంలో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు.

తెల్లరాయి ట్రాక్టర్ స్వాధీనం



వరికుంటపాడు: తూర్పుబోయమడుగుల, అలివేలుమంగాపురం పరిధిలోని అటవీ ప్రాంతం నుంచి తెల్లరాయిని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో ఉదయగిరి అటవీ రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి తన సిబ్బందితో గురువారం దాడులు నిర్వహించారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా తెల్లరాయి తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని రూ.20 వేలు అపరాధ రుసుం విధించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సంగం: మండలంలోని పడమటిపాళెం, గాంధీజన సంఘం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. జెడ్పీటీసీ రావుల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు రావుల ప్రసాద్‌గౌడ్, బొప్పూరు సురేష్, వ్యవసాయాధికారులు వెంకట లక్ష్మి, శ్రీకాంత్, నాయబ్‌బాషా, వాణి, నీలిమ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కావలి: పట్టణంలోని ఆర్ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంపులో భాగంగా గురువారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కావలి అగ్నిమాపక అధికారి రామసిద్ధార్థ అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాన్ని ఎలా నివారించాలో వివరించారు. అనంతరం మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ సునీల్‌కుమార్, ఎన్‌సీసీ అధికారులు బాల బ్రహ్మాచారి, సౌజన్య, శ్యాం కుమార్, ప్రదీప్, శ్రీపతి ప్రసాద్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టిప్పు సుల్తాన్ జయంతి



ఉదయగిరి: స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో టిప్పు సుల్తాన్ జయంతిని ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. టిప్పు సుల్తాన్ చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. టిప్పు సుల్తాన్ జీవిత చరిత్రను స్మరించుకున్నారు. ఆవా జ్ కమిటీ నాయకులు ఫరిద్దీన్‌బాషా, నాయబ్, తిరుపతి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజెక్షన్ వల్లే ఇన్ఫెక్షన్

- భర్త, బంధువుల ఆగ్రహం



చికిత్స పొందుతున్న సుహాన

ఉదయగిరి : స్థానిక సీహెచ్‌సీకి కాన్పు కోసం తీసుకొచ్చిన గర్భిణి చేతికి వైద్యుల సూచనల మేరకు సిబ్బంది ఇంజెక్షన్ వేయగా ఇన్ఫెక్షన్‌కు దారితీయడంపై ఆమె భర్త అర్షద్, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు.. దాసరపల్లి గ్రామానికి చెందిన సుహానను సోమవారం రెండో కాన్పు కోసం ఉదయగిరి వైద్యశాలకు తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షలు చేసి డెలివరీ సమయం అయిందని, ఇక్కడే ఉండాలని సూచించారు. అయితే సుహానకు నొప్పులు రాకపోవడంతో ఆమె చేతికి వైద్య సిబ్బంది మంగళవారంఇంజెక్షన్ వేశారు. అనంతరం ఆమెకు కాన్పు జరిగింది. అయితే ఇంజెక్షన్ సక్రమంగా వేయకపోవడంతో చేయి వాచి నొప్పి అధికమైంది. ఈ విషయాన్ని వైద్యులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని బంధువులు ఆరోపించారు. ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి చూపించుకుని వస్తామన్నా కుదరదని, తాళం వేస్తామని బెదిరించారన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లి పరీక్షలు చేయించగా చేయి ఇన్ఫెక్షన్‌కు గురైందని, నెల్లూరుకు తీసుకెళ్లాలని అక్కడి వైద్యుడు సూచించారు. దీంతో గురువారం సుహానను నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తునట్లు తెలిపారు. వైద్యశాలలో డాక్టర్లు, సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని ఆరోపించారు. ఈ విషయమై వైద్యుల వివరణ కోసం ప్రయత్నించినా వారు అందుబాటులోకి రాలేదు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ఆనంద హేల



ఎమ్మెల్యే చేతుల మీదుగా తండ్రి శివయ్యతో కలిసి ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకుంటున్న నాని

ఆత్మకూరు: ఆ విద్యార్థులు పేద కుటుంబాలకు చెందిన వారు. వారి తల్లిదండ్రులు సన్న, చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు. మరికొందరు చిరు వ్యాపారాలు చేసుకుంటూ తమ చిన్నారులను కష్టపడి చదివించారు. విద్యార్థులు సైతం తల్లిదండ్రుల కష్టాలను గుర్తెరిగి పాలిటెక్నిక్‌ను పూర్తిచేసి చిన్నవయసులోనే ఉద్యోగాలను సాధించారు. ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉద్యోగ విజయోత్సవ సభలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. తల్లిదండ్రులతో కలిసి నియామక పత్రాలను అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

తండ్రి కష్టం గుర్తించా



“ నా తండ్రి శివయ్య పొలం పనిచేస్తూ మమ్మల్ని చదివించాడు. సంగంలో పదో తరగతి పూర్తి చేసి ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరి మూడేళ్ల కోర్సు పూర్తి చేశా. వీల్స్ ఇండియా కంపెనీలో రూ.2.30 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉంటా.

– గరికిపాటి నాని, మర్రిపాడు, సంగం మండలం

కుటుంబానికి చేదోడుగా ఉంటా



నాది సంగం మండలం తరుణవాయి. నాన్న రాజయ్య చిన్నపాటి రైతు. బాగా చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని చిన్నప్పటి నుంచి ప్రోత్సహించేవాడు. పదో తరగతి తరువాత ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో చేరా. పాలిటెక్నిక్ పూర్తవగానే ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో రూ.2.60 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం దక్కింది. కుటుంబానికి చేదోడుగా ఉంటా.

–గుత్తి భాను ప్రకాష్, తరుణవాయి

చిరువ్యాపారం చేస్తూ పెంచాడు



“ నా తండ్రి మీరా మొహిద్దీన్ చిరు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మమ్మల్ని బాగా చదవాలని ప్రోత్సహించేవాడు. వింజమూరులో పదో తరగతి చదివిన అనంతరం ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాలలో చేరా. పాలిటెక్నిక్ పూర్తవగానే ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో రూ.2.60 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

–పోలిచర్ల నాయబ్ రసూల్, దుత్తలూరు

చిన్నవయసులోనే ఉద్యోగం ఆనందం



“ నాది మహమ్మదాపురం గ్రామం. పదో తరగతి వరకు గ్రామంలో చదివా. ఉన్నత చదువులకు నెల్లూరు, ఆత్మకూరుకు వెళ్లాల్సిన పరిస్థితి. నా తండ్రి భువనేశ్వర్ ప్రోత్సాహంతో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ రాసి ఆత్మకూరులో సీటు సాధించా. ప్రస్తుతం వీల్స్ ఇండియా కంపెనీలో రూ.2.3 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం వచ్చింది. చిన్న వయసులోనే ఉద్యోగం పొందడం ఆనందంగా ఉంది. ప్రైవేట్‌గా ఉన్నత చదువులు చదువుతా.

–బందారు విశ్వనాథ్, మహమ్మదాపురం